సాక్షి నంద్యాల

సోమవారం ; 31 ; మార్చి ; 2025



శ్రీమఠంలో ఉగాది వేడుక

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో ఆదివారం ఉగాది వేడుక నిర్వహించారు. నూతన ఏడాదికి శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు స్వాగతం పలికారు.



సీఐలకు స్థాన చలనం

పోలీస్ శాఖ నాలుగో జోన్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప జిల్లాల్లోని వివిధ సర్కిళ్లలో పనిచేస్తున్న 16 మంది సీఐలకు స్థాన చలనం కలిగింది. 8లో▸



నేడు పిడకల సమరం

పిడకల సమరానికి ఆస్పరి మండలంలోని కైరుప్పల సిద్ధమైంది. సోమవారం వేడుకను నిర్వహించేందుకు గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

జీవితాల్లో చీకట్లు నింపారు



ఆందోళన చేస్తున్న వలంటీర్లు

నంద్యాల(అర్బన్): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ జీవితాల్లో చీకట్లు నింపారని వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ విమర్శించారు. అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగిస్తామని, ప్రతి ఒక్కరికీ రూ.10వేలు వేతనం ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ఉగాది పండుగ నేపథ్యంలో వలంటీర్లు ఆదివారం బొమ్మలసత్రం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వలంటీర్లను రోడ్డున పడేసిందన్నారు. ఎంతో మంది వలంటీర్లు ఉపాధి లేక ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాజగోపాల్, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, రఫీ, నాగన్న, సుధాకర్, అజ్మతుల్లా, హైమావతి, కల్యాణి, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

నంద్యాల: కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టమ్, పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ సోమవారం రంజాన్ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో పీజీఆర్ఎస్‌ను రద్దు చేశామన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా కేంద్రానికి రావద్దని విజ్ఞప్తి చేశారు.

అల్లా ఆశీస్సులు అందాలి

నంద్యాల: జిల్లా ప్రజలందరికీ అల్లా ఆశీస్సులు అందాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదివారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లింలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. పవిత్రత, క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల మేళవింపే రంజాన్ పండుగ ముఖ్య ఉద్దేశమన్నారు. పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ అన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



క్యూలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

శ్రీశైలం: క్షేత్ర పరిధిలో విధులు నిర్వర్తించే పోలీసు సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. ఆదివారం శ్రీశైలం చేరుకున్న ఆయన భక్తులు వేచి ఉండే కంపార్ట్‌మెంట్లు, క్యూలను, లడ్డూ విక్రయ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా అనుకోని సంఘటన జరిగితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. పోలీసు సిబ్బంది సమన్వయంతో ఉగాది ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించామన్నారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను ఆయన దర్శించుకుని నంద్యాల జిల్లాలోని ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలన్నారు. ఆయన వెంట ఆత్మకూరు డీఎస్పీ రామంజి నాయక్, శ్రీశైలం వన్ టౌన్ సీఐ ప్రసాద్ రావు పాల్గొన్నారు.

మనోహరం

- శ్రీశైలంలో అంగరంగ వైభవంగా రథోత్సవం
- స్వామిఅమ్మవార్ల దర్శనంతో పులకించిన భక్తులు
- రమావాణీ సేవిత రాజరాజేశ్వరి అలంకారంలో భ్రమరాంబాదేవి కటాక్షం
- ఉగాది మహోత్సవాలకు నేడు పూర్ణాహుతి



రథంపై ఆశీనులైన స్వామిఅమ్మవారు



శ్రీశైల క్షేత్ర పురవీధుల్లో భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి రథోత్సవ దృశ్యం

శ్రీశైలంటెంపుల్: ప్రణవనాదం ప్రభవించింది.. మదిమదిలో భక్తిభావం వెల్లివిరిసింది. జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో రథోత్సవం రమణీయంగా సాగింది. తేరుపై మహా దివ్య తేజాన్ని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. హరహర మహాదేవ శంభో శంకర అంటూ కర్పూర నీరాజనాలు అర్పించారు. ఉగాది మహోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు స్వామిఅమ్మవార్లకు రథోత్సవాన్ని నిర్వహించారు. శ్రీభ్రమరాంబాదేవి రమావాణీ సేవిత రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులను కటాక్షించారు. రథోత్సవంలో పలువురు కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

భక్తిపారవశ్యం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగింపుగా రథశాల వద్దకు తోడ్కొనివచ్చి రథంపై అధిష్టింపజేశారు. స్థానాచార్యులు.. రథాంగపూజ, రథాంగహోమం, రథాంగ బలి నిర్వహించారు. అర్చకులు ఉత్సవమూర్తులకు ప్రత్యేక హారతులు ఇచ్చారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, అధికారులు రథానికి కూష్మాండబలి సమర్పించారు. రథానికి ప్రత్యేక హారతిచ్చి ఉత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవంలో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. రథంపై స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. 'సిరిగిరి మల్లయ్య.. మహాత్మా మల్లయ్య' అని కొనియాడుతూ కన్నడ భక్తులు రథంపైకి అరటిపండ్లు, ఖర్జూరాలు, కలకండ భక్తిపూర్వకంగా విసిరారు. రథోత్సవాన్ని గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు నిర్వహించారు. ఉత్సవంలో గొరవయ్యల నృత్యం ఆకట్టుకుంది.



రథోత్సవంలో అశ్వాలతో విన్యాసాలు చేస్తున్న కళాకారులు

నేడు పూర్ణాహుతి

ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభమైన ఉగాది మహోత్సవాలకు సోమవారం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అమ్మవారు భ్రమరాంబాదేవి నిజాలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. స్వామిఅమ్మవార్లను అశ్వవాహనంపై అధిష్టింపజేసి ఆలయ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు.



రమావాణీ సేవిత రాజరాజేశ్వరీ అలంకారం

ఉగాది మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి ఉత్సవమూర్తిని రమావాణీ సేవిత రాజరాజేశ్వరీ అలంకారంలో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారు చతుర్భుజాలతోపాశం, అంకుశం, పద్మం, చెరకుగడను ధరించి భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారిని దర్శిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని, సమస్యలన్నీ తొలగిపోతాయని భక్తుల నమ్మకం.



కూష్మాండ బలి పూజల్లో పాల్గొన్న దేవస్థాన ఈఓ, అర్చకులు

ధరలు పెరుగుతాయి

- ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే దైవజ్ఞ



ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే దైవజ్ఞ

ఈ ఏడాది వరి, వేరుశనగ, చెరకు, బెల్లం, పంచదార, నెయ్యి, నూనె గింజలకు ధరలు పెరగవచ్చునని శ్రీశైల దేవస్థాన అస్థాన సిద్ధాంతి పండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞ తెలిపారు. బంగారు, వెండి రేట్లు కూడా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల ఆలయ ప్రాంగాణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే దైవజ్ఞ .. విశ్వావసునామ సంవత్సర విశేషాలను వివరించారు. ఈ ఏడాది దేశంలో రెండు చంద్రగ్రహణాలు కనిపిస్తాయన్నారు. సరస్వతి నదికి పుష్కరాలు వస్తాయన్నారు. పంటలు బాగా పండి దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉంటాయని, జనులందరికీ క్షేమ, ఆరోగ్యాలు కలుగుతాయని తెలిపారు. శ్రీశైల దేవస్థాన కార్య నిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం

- మంత్రులు బీసీ, ఫరూక్
- వైభవంగా ఉగాది వేడుకలు
- పలువురికి ఉగాది పురస్కారాలు అందజేత

నంద్యాల: జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించి రాష్ట్రంలో అగ్రగామిగా నిలుపుదామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మంత్రులతో పాటు జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ తదితర ఉన్నతాధికారులు ఉగాది ఉత్సవాలను పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూజాది కార్యక్రమాలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. అనంతరం పంచాంగ కర్తలు ప్రవీణ్ కుమార్ శర్మ, శివకుమార్ శర్మ ఉగాది పంచాంగ పఠనాన్ని వారు శ్రద్ధగా ఆలకించారు. షడ్రుచుల ఉగాది పచ్చడిని ఆస్వాదించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న అధికారులు, సిబ్బంది అంత కలసి ఒక కుటుంబంగా ఈ ఉత్సవాల్లో పాల్గొనడం చూస్తే చాలా ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో సహజ వనరులకు కొదవలేదన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ విశ్వావసు నామ సంవత్సరం విశ్వాన్నే వశం చేసుకున్న శ్రీమన్నారాయణుడే అన్నారు. అంటే ధనం... యువత అవకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటు జిల్లా సుసంపన్నంగా ఉండాలని, ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించిన గెలివి సహదేవుడు, గ్రందే నరేంద్ర, గంగుల నాగరాజు, ధోనిపూడి నరేష్, నీలం వెంకటేశ్వర్లు, కొప్పుల ప్రసాద్, నీలకంఠమాచారి, మహబూబ్ బాషా, అన్నం శ్రీనివాసరెడ్డి, శేషఫణి, కిశోర్ కుమార్, రత్నలక్ష్మి, మద్దిలేటి, తొగట సురేష్ బాబులను కలెక్టర్, మంత్రులు అభినందిస్తూ శాలువలు, వివిధ రకాల ఫలాలతో ఘనంగా సత్కరించారు. అలాగే విశిష్ట సేవలందించిన వ్యవసాయ రంగంలో పగిడాల వెంకటేశ్వర్లు, విద్యారంగంలో వైష్ణవ వెంకటరమణ, పరిశ్రమల రంగంలో గెలివి రామకృష్ణ, క్రీడారంగంలో ఎం.మల్లికార్జున, సామాజిక సేవా రంగంలో ఎస్.నాగశేషులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన విద్యార్థులను పలువురిని అలరించాయి. బాలభవన్ విద్యార్థులను మంత్రి బీసీ నగదు బహుమతితో అభినందించారు. వేడుకల్లో డీఆర్ఓ రాము నాయక్, ఆర్డీఓ విశ్వనాథ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



పురస్కారాలు అందిస్తున్న మంత్రి బీసీ, కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్



నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

నేడు ఈద్

'చాంద్ దిఖ్ గయా.. కల్ హి ఈద్ హై.. ఈద్ ముబారక్' అంటూ ఆదివారం సాయంత్రం ముస్లింలు ముందస్తు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. రంజాన్ నెలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు చుక్క నీరు తాగకుండా నిష్టతో రోజాలు పాటించారు. ఐదు పూటలా నమాజులు చేశారు. శక్తి కొద్దీ దాన ధర్మాలు ఇచ్చారు. అనేక పుణ్యకార్యాలు నిర్వహించారు. నెలవంక కనిపించడంతో జిల్లాలో ఈద్గాలతోపాటు మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

– నంద్యాల(వ్యవసాయం)



ముస్తాబైన నంద్యాల సాయిబాబా నగర్‌లోని ఖుబ్రా మసీదు

నేడు, రేపు బ్యాంకుల్లో లావాదేవీలు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): ఈనెల 31, ఏప్రిల్ 1 తేదీల్లో బ్యాంకులు పని చేయవు. 2024–25 ఆర్థిక సంవత్సరం సోమవారం ముగియనుంది. ఆర్థిక సంవత్సరం చివరి రోజున ప్రభుత్వానికి చలానా ద్వారా చెల్లించేందుకు ఉద్దేశించిన లావాదేవీలు నిర్వహించేందుకు ఎంపిక చేసిన కొన్ని బ్యాంకు శాఖలు మాత్రమే పని చేస్తాయి. ఈ బ్యాంకుల్లో కూడా ఖతాదారుల లావాదేవీలు చేపట్టరు. ఇన్‌కం టాక్స్, జీఎస్టీ బిల్లులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చలనాలు తీసుకోవడం వంటి వాటిని మాత్రమే చేపడతారు. మిగిలిన బ్యాంకులకు సెలవు ఉంటుంది. 2025–26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి మొదలవుతుంది. 1వ తేదీ కూడా అన్ని బ్యాంకులు తెరిచినా ఖాతాదారుల లావాదేవీలు చేపట్టరు. గతేడాది చేపట్టిన లావాదేవీలకు సంబంధించిన లెక్కలను ఇంటర్నల్‌గా క్లోజ్ చేసుకుంటారు. 2వ తేదీ నుంచి యథావిధిగా బ్యాంకులు పనిచేస్తాయి.

చివరికి మిగిలింది కన్నీరే!

- కేసీ ఆయకట్టుకు 20 రోజులుగా అరకొర నీరు
- ఈ నెల 31 వరకే నీటి సరఫరా అంటున్న అధికారులు
- ఎండిపోతున్న పొలాలు.. రైతులకు మిగిలింది కన్నీరే!
- చేష్టలుడిగి చూస్తున్న పాలకులు



నీరందక వరి పొలంలో పగుళ్లు

ఆళ్లగడ్డ: '' రైతుల సంక్షేమమే ధ్యేయం.. బంగారు పంటలు పండేలా చేసి కరువు సీమను సస్యశ్యామలం చేస్తాం'' అని టీడీపీ నేతలు ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయి. కేసీ కెనాల్‌కు 10 నెలలు అయినా సక్రమంగా నీరు రావడం లేదు. అరకొర వస్తున్న నీరు చివరి ఆయకట్టు చేరక పోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. ప్రజాప్రతినిధుల మాటలు నమ్మి వరి సాగుచేసిన రైతులకు నష్టమే మిగులుతోంది. కేసీ కెనాల్‌కు ఎన్ని రోజులు నీరు విడుదల చేస్తారో నేటికీ స్పష్టత ఇవ్వడం లేదు. రూ. లక్షకు పైగా అప్పు చేసి సాగు చేసిన పైర్లను కొన్ని చోట్ల పశువుల మేతగా వదిలేయాల్సిన దుస్థితి నెలకొంది. పంట ఎండిపోతుండటంతో రైతులు విలవిల్లాడుతున్నారు. కళ్లముందే ఎండిపోతున్న పంటను చూడలేక అనేక మంది కిలోమీటర్ల మేర పైపులు వేసుకుని రోజు రూ. వేలు వెచ్చించి పంటను తడిపేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఇటు'కేసీ' చూడండి!

సుంకేసుల జలాశయం నుంచి ప్రారంభమయ్యే కేసీ కెనాల్ వైఎస్సార్ జిల్లా కృష్ణాపురం వరకు 304 కి.మీ పొడువునా ప్రవహిస్తుంది. తుంగభద్ర, కృష్ణా నీటిని కలిపి 31.9 టీఎంసీలు ఈ కాల్వకు నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. ఈ నీటితో 2,65,628 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలి. అయితే సుమారు 20 రోజులుగా నీరు సక్రమంగా అందడం లేదు. నీరు ఎప్పుడు వస్తుందో ఎన్నిరోజులు పారుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు.

బీటలు బారిన పొలాలు

జిల్లాలో నంద్యాల నుంచి ఆళ్లగడ్డ చివరి (వైఎస్సార్ జిల్లా సరిహద్దు) ఆయకట్టు 27వ లాక్ నీరు చేరాలంటే 16వ లాక్ వద్ద కనీసం 5.6 అడుగుల మేర నీటి ప్రవాహం ఉండాలి. కానీ సుమారు 20 రోజుల నుంచి ఎగువ నుంచి నీటి ప్రవాహం నిర్దేశించిన స్థాయిలో రావడంలేదు. ఫలితంగా 23వ లాక్ నుంచి 27వ లాక్ వరకు ప్రవాహం పూర్తిగా నిలిచింది. దీంతో చేతికందే దశలో ఉన్న వరి, మొక్కజొన్న, మిరప, మినుము, కొర్ర తదితర పంటలు దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చివరి ఆయకట్టులో ఇప్పటికే ఎండిపోయి బీటలు బారిన పొలాలు ఇప్పుడు నీరందిన ఏమాత్రం ఫలితం ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కేసీ కెనాల్‌లో నిలిచిన నీటి ప్రవాహం

మాటలు కోటలు.. నీళ్లల్లో కోతలు

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో చివరి ఆయకట్టు వరకు సమృద్ధిగా సాగునీరు అందిస్తామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ పదేపదే చెప్పారు. అయితే మాటలు నీటి మూటలయ్యాయి. ఫిబ్రవరి చివరి వారం నుంచే కేసీలో నీళ్లు అరకొర రావడం మొదలయ్యాయి. మార్చిలో పూర్తిగా చివరి ఆయకట్టుకు నీరందలేదు. అయితే ఎమ్మెల్యే మాటలు నీటిమూటలు అయ్యాయని రైతులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. ఈ నెపం అధికారులపై నెట్టేందుకు పూనుకున్నారు. ఎమ్మెల్యే సోదరుడు విఖ్యాత్‌రెడ్డి కేసీ కెనాల్ పై ధర్నా చేస్తానని హుకుం జారీచేశారు. అలాగే కాల్వపై వెళ్లి అధికారులను ప్రశ్నించారు. తాజాగా ఎమ్మెల్యే పొన్నాపురం శివారులో కాల్వను పరిశీలించి ఇక్కడ 5 అడుగుల నీటిని స్టోరేజ్ చేసి దిగువకు విడుదల చేయాలని అధికారులతో వాదించారు. నీటి విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. అధికారంలో ఉన్న ఎమ్మెల్యే ప్రభుత్వంతో మాట్లాడి నీటిని విడుదల చేయించాలి కానీ.. అధికారులమీద మండిపడితే ఏం వస్తుందని చర్చించుకుంటున్నారు.

ఎండిపోయిన ఆశలు



ఈ రైతు పేరు దశరథరామిరెడ్డి. అమ్మిరెడ్డి నగరానికి చెందిన ఈయన గోవిందిన్నె పొలిమేరలోని కేసీ కెనాల్ ఆయకట్టు కింద 10 ఎకరాల్లో వరి సాగు చేశాడు. సుమారు రూ. 4 లక్షల వరకు ఖర్చు అయింది. వరి పొట్టకొచ్చే వరకు అడపాదడపా వచ్చే నీరు 20 రోజులుగా పూర్తిగా నిలిచి పోయింది. మరో 20 రోజుల్లో చేతికొచ్చే పైరు పూర్తిగా ఎండిపోయిందని, ఇప్పుడు నీరు వచ్చినా ఎలాంటి ఉపయోగం ఉండదని పెట్టుబడిలో ఒక్క పైసా కూడారాదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

నష్టమే వచ్చింది



ఈ చిత్రంలో నీరు లేక బీటలు వారిన వరి దుబ్బులను చూపుతున్న రైతు పేరు నన్నె సాహెబ్. దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు గ్రామానికి చెందిన ఈయన కోవెలకుంట్ల మండలం కంపమల్ల గ్రామంలోని హరివరం చానెల్ కింద ఎకరాకు రూ. 20 వేల చొప్పున రెండు ఎకరాలకు మును గుత్త (కౌలు) చెల్లించి కౌలుకు తీసుకున్నాడు. ఇప్పటికి కౌలుతో కలుపుకుని సుమారు రూ. లక్షవరకు ఖర్చు చేశాడు. ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న వరి పూర్తిగా ఎండిపోయింది. రూ. లక్ష అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టానని, పైరు పూర్తిగా ఎండి పోయిందని, నష్టమే వచ్చిందని బోరున విలపిస్తున్నాడు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కేసీ కెనాల్ కింద ఆయకట్టు

మండలం	ఎకరాలు
శిరివెళ్ల	16,304
ఆళ్లగడ్డ	23,580
దొర్నిపాడు	13,500
ఉయ్యాలవాడ	12,168
చాగలమర్రి	8,276
రుద్రవరం	284

అదృష్టం బాగుంటే నీరు వస్తుంది



నీళ్లు తక్కువగా ఉన్నాయి. ముందుగా కిందకు పారించి అక్కడి నుంచి ఆపుకుంటూ పైనున్న పొలాలకు అందించేలా ప్రణాళిక వేసుకున్నాం. ఈ మేరకు ఈ నెల 31వ తేదీ వరకు ఉన్న నీటిని అందరికీ పంచేందుకు ప్రయత్నం చేస్తున్నాం. దీంతో పైనున్న కొందరు రైతులు ఆందోళన చేస్తున్నారు. వారికి నచ్చచెప్పాం. ఈ నెల 31 తరువాత కూడా నీళ్లు అందించేందుకు ప్రయత్నం చేస్తాం. అయితే కచ్చితంగా చెప్పలేం. అదృష్టం బాగుంటే నీరు వస్తుంది.

– రవీంద్ర, డీఈఈ, కేసీ కెనాల్

క్లుప్తంగా

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ

ఆత్మకూరురూరల్: వెలుగోడు మండలం తిమ్మనపల్లె గ్రామంలో కట్టుకున్న భార్యను అంతమొందించిన భర్తను వెలుగోడు పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి నిందితుడి వివరాలను మీడియాకు వివరించారు. అనుమానంతో ఈనెల 28వ తేదీన భార్య లక్ష్మీదేవిని ఆమె భర్త పసుపుల మధుకృష్ణ గొడ్డలి కామాతో తలపై మోదడంతో ఆమె చనిపోయింది. మృతురాలి తల్లి వెంకట సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆదివారం మధుకృష్ణను అరెస్ట్ చేసిన పోలీసులు మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరుచగా రిమాండ్‌కు ఆదేశించారు.

నాలుగు గడ్డివాములు దగ్ధం

డోన్ టౌన్: యర్రగుంట్ల గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలోని నలుగురు అన్నదమ్ములకు చెందిన గడ్డి వాములు అగ్నికి ఆహుతయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వన్నేపోగు మద్దిలేటి కుమారులు తిమ్మయ్య, మద్దయ్య, లక్ష్మన్న, ఎర్రమల పశుగ్రాసాన్ని కల్లం దొడ్డిలో నిల్వ చేసుకున్నారు. అయితే ఆదివారం ఓ గడ్డి వామి మంటలు వ్యాపించడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది ఫైరింజన్లతో హుటాహుటిన చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే నాలుగు గడ్డివాములకు మంటలు వ్యాపించి దగ్ధమయ్యాయి. ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించాయా, ఎవరైనా నిప్పు పెట్టారా అనే విషయం తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంలో దాదాపు రూ. 5 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు చెబుతున్నారు.

సచివాలయ ఉద్యోగి బలవన్మరణం

ఆదోని అర్బన్: పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన నారాయణరావు, సరోజబాయి దంపతుల కుమారుడు మధు(26) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం ఈ సంఘటన చోటు చేసుకుంది. త్రీటౌన్ సీఐ రామలింగమయ్య తెలిపిన వివరాల మేరకు.. మధు అనే యువకుడు ఆదోని మండలం కపటి గ్రామంలోని సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి పడుకోవడానికి మేడపైకి వెళ్లి ఆదివారం ఉదయం ఎంత సేపటికి కిందికి రాలేదు. తల్లిదండ్రులు మిద్దెపైకి వెళ్లి చూస్తే గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని చనిపోయి ఉన్నాడు. మృతికి గల కారణాలు పని ఒత్తిడో, ప్రేమ వ్యవహారమో తెలియదని, ప్రస్తుతానికి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.



శిరివెళ్లలో రంగులు చల్లుకుంటున్న యువకులు



పాణ్యం.. భూపనపాడులో బోనాలు ఎత్తిన భక్తులు



ఉయ్యాలవాడ.. సుద్దమల్లలో ఆలయం చుట్టు తేరుబండ్ల ప్రదక్షిణ

'విశ్వావసు'కు భక్తి పూర్వక స్వాగతం



కోడుమూరులో అశేషజనం మధ్య సాగుతున్న శ్రీవల్లెలాంబాదేవి రథోత్సవం

'విశ్వావసు' నామ సంవత్సరానికి జిల్లా ప్రజానీకం భక్తి పూర్వక స్వాగతం పలికింది. ఆదివారం భక్తులు తమ ఇష్ట దేవతామూర్తుల ఆలయాల్లో పూజలు నిర్వహిస్తూ నూతన తెలుగు సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. గ్రామ దేవతలు సుంకులమ్మ, రేణుకా ఎల్లమ్మ, సవారమ్మ, మారెమ్మ, జంబులమ్మ, తదితర జగన్మాతలకు చీరెలు, సారెలు, నైవేద్యాలు సమర్పించారు. రైతులు తమ వృషభాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామాల్లో ఊరేగిస్తూ ఆలయాలను సందర్శించి కొబ్బరి కాయలు సమర్పించారు. పొలాలకు వెళ్లి సేద్యం చేసి ఈపడాది సాగును ప్రారంభించారు. ప్రముఖ ఆలయాల్లో వేద పండితులు, మిగతా ఆలయాల్లో అక్కడి పురోహితులు పంచాంగ శ్రవణం చేశారు. – సాక్షి, నెట్‌వర్క్



దేవనకొండ..పంచాంగం చెబుతున్న పురోహితుడు



హోలహర్వి..ఎద్దులతో గుంటక పాస్తున్న దృశ్యం



నంద్యాలలో రంగులు చల్లుకుంటూ సంబరాలు



కల్లూరు చౌడేశ్వరి మాత గుడి చుట్టూ ఎద్లను తిప్పుతున్న రైతులు



హొళగుంద..గజ్జహళ్లిలో 130 కేజీల రాతి గుండును ఎత్తుతున్న దాసరి సుబ్బు



నందవరం మండలం జోహరాపురంలో పొట్టేళ్ల పోటీలు

హోటళ్లపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల దాడులు



హోటల్‌లో శాంపిల్స్ సేకరిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు రాజగోపాల్, వెంకట రాముడు

శ్రీశైలం: శ్రీశైలంలోని పలు హోటళ్లపై ఆదివారం ఫుడ్ సేఫ్టీ అధికారులు రాజగోపాల్ (కర్నూల్), నంద్యాల జీఎఫ్‌ఐ వెంకట్ రాముడు, ఎన్.రాముడు, ఎఫ్ఎస్‌ఓ బృందం సభ్యులు దాడులు నిర్వహించారు. బస్టాండ్ సమీపంలోని కృష్ణవేణి హోటల్లో గోబీ మంచూరియాలో కృత్రిమ కలర్లను వినియోగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే కర్ణాటక సత్రం వద్ద ఉన్న మంజునాథ స్వీట్ షాపులో బతానీలకు సింథటిక్ ఫుడ్ కలర్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వాటన్నిటిని చెత్త కుప్పలో పారబోయించారు. అలాగే మరి కొన్ని హోటళ్లలో వాడిన నూనెను మళ్లీ మళ్లీ వాడుతున్నట్లు గుర్తించి పారబోయించారు. అనంతరం వారు మాట్లాడుతూ తనిఖీల్లో పలు హోటళ్ల నుంచి ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు.

మందుబాబుల వీరంగం

- పోలీసుపై దాడి

ఓర్వకల్లు: మద్యం మత్తులో నలుగురు యువకులు వీరంగం సృష్టించారు. ఏకంగా పోలీసు కానిస్టేబుల్ పైనే దాడికి పాల్పడ్డారు. శనివారం సాయంత్రం మండలంలోని నన్నూరు గ్రామం వద్ద ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వెల్దుర్తి మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన నలుగురు యువకులు పూటుగా మద్యం సేవించి స్థానిక బంగ్లా బస్టాండ్ ప్రాంతంలో బైక్‌లను ఆపి ఇతరులపై బూతుపురాణాలకు దిగారు. అదే సమయంలో ఓ పోలీసు కానిస్టేబుల్ ఇంటి నుంచి స్టేషన్‌కు బయలుదేరాడు. మందుబాబులు రోడ్డుకు అడ్డంగా పెట్టిన బైక్‌లను చూసి పక్కకు తీయమని చెప్పగా తమ ఇష్టమని.. ఎవ్వరికి చెప్పుకుంటారో? చెప్పుకోండంటూ దురుసుగా ప్రవర్తించడమే కాక కానిస్టేబుల్‌పై చేయి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న ఓర్వకల్లు ఎస్‌ఐ సునీల్‌కుమార్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ఆ యువకులను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అయితే, రాజకీయల నాయకుల ఒత్తిడితో వారిపై కేసు నమోదు చేయకుండా ఆదివారం వదిలేసినట్లు తెలిసింది.

ప్రేమను గెలిపించే పిడకల సమరం

- నేడు కైరుప్పలలో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన గ్రామస్తులు

ఆస్పరి: శ్రీ వీరభద్రస్వామి, కాళికాదేవి మధ్య ప్రేమ వివాహం విజయం కావడం.. ఇందుకు పిడకల సమరం దోహదపడటంతో ప్రతి ఏటా కైరుప్పల గ్రామంలో పెద్ద నుగ్గులాట నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం వేడుకను నిర్వహించేందుకు గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలుత శ్రీ వీరభద్రస్వామి, కాళికాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం సర్పంచ్ తిమ్మక్క, ఆలయ కార్యనిర్వహణ అధికారి రాంప్రసాద్, గ్రామపెద్దల ఆధ్వర్యంలో వేలాది మంది జనం మధ్య పిడకల సమరం (పెద్ద నుగ్గులాట) జరగనుంది. పిడకల సమరాన్ని చూడడానికి కర్నూలు జిల్లాప్రజలేకాకుండా కర్ణాటక, తెలంగాణ తదిత ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు రానున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కైరుప్పలలో పిడకల సమరం జరగడం ప్రత్యేకతగా నిలిచింది.

చారిత్రక నేపథ్యమిదీ..

పిడకల సమరానికి చారిత్రక నేపథ్యం ఉందని స్వామి భక్తులు తెలిపారు. విహార యాత్రకు వెళ్లిన వీరభద్రస్వామి తనకు తారాస పడిన కాళికాదేవితో ప్రేమలో పడి వివాహం చేసుకుంటున్నానని మాట ఇచ్చాడట. అయితే ఆ తర్వాత స్వామి ఇచ్చిన మాట తప్పడంతో కాళికాదేవి వర్గీయులకు తీవ్ర ఆగ్రహంతో పిడకలతో స్వామి వర్గీయులపై దాడికి దిగిరాట. స్వామి వర్గీయులు కూడా పిడకలతో ఎదురు దాడికి దిగారాట. సమరాన్ని ఆపించి పెద్దలు పంచాయితీ చేసి వీరభద్రస్వామి, కాళికాదేవి వివాహం చేశారని పెద్దలు చెబుతున్నారు. వీరభద్రస్వామి, కాళికాదేవి ప్రేమ వ్యవహారం కారణంగా భక్తులు పిడకల సమరం చేసుకోవడం ఆచారంగా వస్తోంది.



కైరుప్పలలో వెలసిన వీరభద్రస్వామి, కాళికాదేవి

సమరం సాగుతుంది ఇలా..

పుప్పాలదొడ్డి, చెన్నంపల్లి, అలారుదిన్నె, వెంగళాయదొడ్డి, కారుమంచి, కలపరి గ్రామాల ప్రజలు తమ కోరికలను తీర్చిన వీరభద్రుడికి మొక్కుబడి సమర్పించేందుకు ఒక నెల నుంచే పశువుల పేడతో పిడకలు తయారు చేస్తారు. వాటిని ఉగాది మరుసటి రోజు దేవుడి సన్నిధికి చేరుస్తారు. పిడకల సమరానికి ముందు భక్తులు రెండు వర్గాలుగా విడిపోయి పిడకలతో కొట్టుకుంటారు. దెబ్బలు తగలకుండా టవాళ్లతో ముసుగు తొడుక్కుంటారు. అరగంట పాటు జరిగే పిడకల సమరంలో చాలా మంది భక్తులు గాయపడుతారు. గాయానికి స్వామివారి బండారం రాసుకుని ఇంటి ముఖం పడతారు.

'కారుమంచి' ఆచారం

కారుమంచి గ్రామానికి చెందిన పెద్దరెడ్డి వంశస్థుల్లో ఒకరు పిడకల సమరం రోజు శిరస్సున కిరీటం ధరించి, ఖడ్గం చేత పట్టుకుని అశ్వంపై కైరుప్పల గ్రామానికి తన అనుచరులతో వస్తారు. అనంతరం వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి కారుమంచి వైపు వెళ్తారు. తర్వాత పిడకల సమరం మొదలవుతుంది. ఆలయ అభివృద్ధిలో పెద్దరెడ్డి వంశస్థులు కీలక పాత్ర పోషించారు. ఆ కుటుంబానికి స్వామి ఉత్సవాల్లో ప్రత్యేక స్థానం కల్పిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పురస్కారాలు ప్రదానం

కర్నూలు కల్చరల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రదానం చేసే రాష్ట్ర స్థాయి పురస్కారాలను జిల్లాకు చెందిన ప్రముఖులు అందుకున్నారు. విజయవాడలోని తుమ్మల పల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి ఉగాది వేడుకల్లో రాష్ట్ర ముఖ్య మంత్రి చేతుల మీదుగా వీరు పురస్కారాలను అందుకున్నారు. కళా రంగంలో విశేష సేవలు అందిస్తున్న సుప్రసిద్ధ కళాకారులు నంది అవార్డు గ్రహీత, సాహితీ వేత్త, విశ్రాంత ప్రిన్సిపాల్ పత్తి ఓబులయ్య 'కళా రత్న' ఉగాది హంస పురస్కారంతో పాటు రూ. 50 వేల నగదు, సాహిత్య రంగంలో విశేష సేవలు అందిస్తున్న కథా రచయిత డాక్టర్ ఎం. హరిషన్, నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్‌లకు 'ఉగాది' పురస్కారాలతో పాటు ఒక్కొక్కరు రూ. 10 వేల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులను సీఎం నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు.



ముఖ్య మంత్రి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న పత్తి ఓబులయ్య, హరికిషన్, అజీజ్

దుకాణంలో అగ్ని ప్రమాదం

- రూ. 2.50 లక్షల ఆస్తి నష్టం



దుకాణంలో కాలిన వస్తువులు

బేతంచెర్ల: స్థానిక కొత్త బస్టాండు సమీపంలోని శివ శక్తి బైక్ జోన్ దుకాణంలో ఆదివారం మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం జరిగింది. ఉగాది పండుగ కావడంతో నిర్వాహకుడు బాల కృష్ణారెడ్డి ఆదివారం ఉదయం పూజ నిర్వహించి దుకాణానికి తాళం వేసి వెళ్లాడు. అయితే కొద్ది సేపటి తర్వాత విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దుకాణంలో పొగలు రావడంతో స్థానికులు గమనించి యజమానికి సమాచారం ఇచ్చారు. దుకాణం తెరిచి చూసే సరికి మంటలు ఎక్కువై అందులోని రేడియం కటింగ్ మిషన్లు, ల్యాప్ టాప్, ఇన్వర్టర్, బ్యాటరీ, సీసీ కెమెరాలు రూ. 30 వేల నగదు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ ప్రమాదంలో దాదాపు రూ. 2.50 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన వహీద్

కర్నూలు: కర్నూలు శివారులోని సంతోష్‌నగర్ జంక్షన్ వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ వహీద్(57) కోలుకోలేక మృతిచెందాడు. గీతాముఖర్జీ నగర్‌లో నివాసముంటున్న ఈయన రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఒక కొడుకు, కూతురు సంతానం. శనివారం రాత్రి గీతా ముఖర్జీ నగర్‌లోని తన ఇంటి నుంచి బైరెడ్డి రైస్‌మిల్ వద్ద ఉన్న మసీదుకు వెళ్లి ప్రార్థన ముగించుకుని సంతోష్ నగర్ కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా బెంగళూరు నుంచి హైదరాబాదు వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న తన కుమారుడు సద్దాం ప్రమాదానికి గురైన తండ్రిని ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీ కేంద్రానికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల సమీపంలో ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుమారు 50 సంత్సరాల వయస్సు కలిగి ఉన్న ఈ వ్యక్తి ట్రాన్స్‌ఫార్మర్ ఇనుప కడ్డీకి పంచెతో ఉరేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో టూటౌన్ ఎస్‌ఐ బీవీ సుబ్బారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సున్నిపెంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. మృతుడు కర్ణాటక లేదా మహారాష్ట్రకు చెందిన వాడై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

16 మంది సీఐలకు స్థానచలనం

- వీఆర్‌లో ఉన్న ఐదుగురికి పోస్టింగులు
- స్టేషన్లలో ఉన్న ఐదుగురు వీఆర్‌కు

కర్నూలు: పోలీస్ శాఖ నాలుగో జోన్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప జిల్లాల్లోని వివిధ సర్కిళ్లలో పనిచేస్తున్న 16 మంది సీఐలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఆదివారం బదిలీల ఉత్తర్వులను విడుదల చేశారు. ఇందులో వీఆర్‌లో ఉన్న ఐదుగురికి పోస్టింగులు దక్కగా స్టేషన్లలో ఉన్న ఐదుగురిని వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు ఆయా జిల్లాల పోలీస్ సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేస్తూ డీఐజీ ఉత్తర్వులిచ్చారు.

బదిలీ అయిన సీఐల వివరాలు

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
వి.శ్రీహరి	వీఆర్, కర్నూలు	మైదుకూరు యూపీఎస్, వైఎస్సార్ కడప జిల్లా
ఎం.గంగిరెడ్డి	వీఆర్, నంద్యాల	సీసీఎస్2, నంద్యాల
ఎస్.చిరంజీవి	ఆళ్లగడ్డ యూపీఎస్	ఫ్యాక్షన్ జోన్, కర్నూలు
ఎం.యుగంధర్	ప్రొద్దుటూరు టూటౌన్	ఆళ్లగడ్డ యూపీఎస్
యు.సదాశివయ్య	పీటీసీ, తిరుపతి	ప్రొద్దుటూరు టూటౌన్
కె.యల్లమ రాజు	వీఆర్, అన్నమయ్య	ఉమెన్ పీఎస్, వైఎస్సార్ కడప
ఎం.కృష్ణారెడ్డి	ఉమెన్ పీఎస్, వైఎస్సార్ కడప	చెన్నూరు యూపీఎస్
ఆర్.పురుషోత్తమ రాజు	చెన్నూరు యూపీఎస్	ఎస్‌బీ1, వైఎస్సార్ కడప
టి.రెడ్డప్ప	ఎస్‌బీ1, వైఎస్సార్ కడప	సీసీఎస్2, వైఎస్సార్ కడప
ఎస్.చాంద్ బాషా	సీసీఎస్2, వైఎస్సార్ కడప	పులివెందుల యూపీఎస్
టి.నరసింహులు	పులివెందుల యూపీఎస్	వేంపల్లి యూపీఎస్
ఎ.సురేష్ రెడ్డి	వేంపల్లి యూపీఎస్	వీఆర్, వైఎస్సార్ కడప
పి.ఈశ్వర్‌రెడ్డి	వీఆర్, వైఎస్సార్ కడప	డీసీఆర్‌బీ, వైఎస్సార్ కడప
యు.వెంకట కుమార్	డీసీఆర్‌బీ, వైఎస్సార్ కడప	వీఆర్, వైఎస్సార్ కడప
హెచ్.కృష్ణం రాజు నాయక్	వీఆర్, వైఎస్సార్ కడప	సీసీఎస్1, వైఎస్సార్ కడప
సి.భాస్కర్‌రెడ్డి	సీసీఎస్1, వైఎస్సార్ కడప	వీఆర్, వైఎస్సార్ కడప